ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలి

సమావేశంలో ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, తదితరులు

- గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులకు సహకరించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి

చిగురుమామిడి, డిసెంబర్ 18: ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, చాలా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో బెల్ట్ షాపులను తొలగించడంపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు పలు అంశాలను ప్రస్తావించారు. గ్రామ పంచాయతీకి కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని చెల్లించలేని స్థితిలో పంచాయతీ పాలకవర్గాలు ఉన్నాయని చెప్పారు. ఇందుర్తి, గాగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపీడీవో నర్సయ్య, పంచాయతీరాజ్ డీఈ రవి ప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ సరిత, వివిధ శాఖల అధికారులతో పాటు వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రం వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ

హుజూరాబాద్, డిసెంబర్ 18: పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని సోమవారం మంత్రి సీతక్క పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. గతంలో టీడీపీలో గుర్రం వెంకటేశ్వర్లుతో కలిసి పని చేసిన అనుభవాలను ఆమె గుర్తు చేసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఇక్కడ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో పాటు కుమారులు గుర్రం హరిబాబు, గుర్రం కళ్యాణ్, కాంగ్రెస్ నాయకులు సందమల్ల నరేశ్, టేకుల శ్రావణ్, బాషవేని రాజేశ్, నల్లగొని రాకేశ్, చల్లూరి విష్ణువర్ధన్, చెంచల మణిదీప్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన వొడితల ప్రణవ్



పూలమాల వేసి శాలువా కప్పి మంత్రి పొన్నంను సత్కరిస్తున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్, డిసెంబర్ 18: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించగా, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 18: తెలంగాణ సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీసీవో, దేవంపల్లి సోషల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.100 రుసుం చెల్లించి, వచ్చే నెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 38 సీవోఈలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం కోసం విద్యార్థులు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలి

హుజూరాబాద్, డిసెంబర్ 18: జనవరి 2వ తేదీ నుంచి కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందని, అర్హులైన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని హుజూరాబాద్ తహసీల్దార్ కే విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం హుజూరాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ, కొత్త ఓటర్ల నమోదుపై బూత్ స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తర్వాత ఫారం-6, 7, 8 నిర్వహణ, బూత్ స్థాయి అధికారుల ఎన్నికల విధులకు సంబంధించి ట్రైనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనర్లు మాధవరావు, తిరుపతి, సాంబమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి డీసెట్ వెబ్ కౌన్సెలింగ్

తిమ్మాపూర్, డిసెంబర్18: డీసెట్ కౌన్సెలింగ్ పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 27వరకు డీఈఐఈడీ మొదటి సంవత్సరంలో చేరేందుకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు ఈ నెల 20న ఎల్ఎండీ కాలనీలోని డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డీసెట్ వెబ్ సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 18: శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సంతోషిమాత సహిత అయ్యప్పస్వామి ఆలయంలో వీ కిరణ్‌కుమారాచార్యులు, సుజితశర్మ ఆధ్వర్యంలో, శ్రీహనుమాన్ ఆలయంలో అవధానుల భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో, కొత్తపల్లిలోని శ్రీనాగేంద్ర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన పూజారి పందిళ్ల భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు జరిపారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, కౌన్సిలర్లు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని పాంబండ వద్ద పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సోమవారం ఆలయ పూజారి గురూజీ ఉమేశ్ స్వామి పంచామృత అభిషేకం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాష్ట్ర కార్యదర్శిగా సంపత్ కుమార్

సంపత్ కుమార్

చిగురుమామిడి, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఇల్లందుల సంపత్ కుమార్ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జీ జగన్‌మోహన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు హర్షం జనార్దన్, రవి కుమార్, గోవర్ధన్ రెడ్డి, మహేందర్, కృష్ణమోహన్, లైబ్రేరియన్ శ్రీనివాస్, అనిత, మమత, స్వరూపారాణి, కవిత, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్ దేవేందర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొప్పిశెట్టి సురేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డీడీ, ఎంఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, డిసెంబర్ 18: సోషల్ వెల్ఫేర్ డీడీ, జమ్మికుంట మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల సమాఖ్య వేదిక నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ హైస్కూల్ నిర్వహణలో పాఠశాల యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నదని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని వారం క్రితం సోషల్ వెల్ఫేర్ డీడీ, ఎంఈవోకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయడంతోపాటు అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో విద్యార్థి సంఘ నాయకులు గట్టు సాయిరాం, మంద భాస్కర్, పర్లపల్లి నాగరాజు, చెల్పూర్ రాములు ఉన్నారు.

కొత్తగట్టు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు



నూతనంగా ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి నిర్మల

శంకరపట్నం, డిసెంబర్ 18: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారి నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా ఎడ్ల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా పప్పు రాజు, కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా నీలం నాగయ్య, ప్రచార కార్యదర్శిగా ఎడ్ల తిరుపతి, గౌరవాధ్యక్షుడిగా పప్పు ప్రభాకర్, డైరెక్టర్లుగా పోలు సమ్మయ్య, రెడ్డి శంకర్, పోలు శంకర్, పిట్టల తిరుపతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందుర్తి పాఠశాలలో పూర్వ విద్యార్థులు అందించిన బ్యాగులతో విద్యార్థులు, తదితరులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

చిగురుమామిడి, డిసెంబర్ 18: మండలంలోని ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు, అమెరికన్ తెలుగు అసోసియేషన్ సభ్యులు స్వరూప, కాశీవిశ్వనాథ్ రెడ్డి చేయూతనందించారు. పాఠశాల ఆవరణలోని స్టేజీకి రేకుల షెడ్డు, స్టేజీ కర్టెన్‌తో పాటు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ ప్యూరిఫైర్, కంప్యూటర్‌ను సమకూర్చారు. అలాగే రంగారెడ్డి రూ.5 వేల విలువైన గేమ్స్ పరికరాలను విద్యార్థులకు అందజేశారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రద, సర్పంచ్ అందె స్వరూప, ఎంపీటీసీలు అందె స్వప్న, కోమటిరెడ్డి చంద్రకళ, ఉప సర్పంచ్ తోట సతీశ్, పూర్వ విద్యార్థులు శ్రీ సత్యనారాయణ రెడ్డి, పర్శయ్య, ఈశ్వర్, లక్ష్మణాచారి, విద్యాకమిటీ చైర్మన్ ఉస్మాన్ పాషా, ఉపాధ్యాయులు బాషబత్తిని ఓదెలు కుమార్, ప్రతాపరెడ్డి, సత్తయ్య, పవన్ కుమార్, రఘుపతి రెడ్డి, అరిఫ్ హుస్సేన్, సవిత, మాధవి, రమాదేవి, రామలింగాచారి గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

పథకాలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

తిమ్మాపూర్, డిసెంబర్ 18: మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని అధికారులు సోమవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార వాహనంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు వారి అభిప్రాయాలను వ్యక్త పరిచారు. అనంతరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా, గ్రామస్తులు పరీక్షలు చేసుకున్నారు. పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుండ్ర నీల మ్మారాజయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మామిడి నందిని

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 18: మండలంలోని వేగురుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని మామిడి నందిని అండర్-14 ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ యూనిస్ పాషా తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో కరీంనగర్ జట్టు తరపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని చెప్పారు. భువనేశ్వర్‌లో ఈ నెల 26న జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో నందిని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని సోమవారం ఎంఈవో మధుసూదనాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 18: పట్టణంలోని ఉర్దూ మీడియం జడ్పీహెచ్ఎస్‌లో ఆరో తరగతి విద్యార్థి ఎస్‌కే సదుల్లాబాబా ఆదివారం హనుమకొండ జిల్లా కాజీపేట పరిధిలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపాడు. కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డి, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఖైరున్నీసాబేగం తెలిపారు. విద్యార్థిని మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయినితోపాటు కరాటే మాస్టర్ ఎస్‌కే జలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.